
సాక్షి పల్నాడు

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 36957 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 36957 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4012 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1703 క్యూసెక్కులు వదిలారు.



52,372 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 48,476 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 52,372 బస్తాలు విక్రయించారు.

పార్టీకి పునాదులు.. పదవులకు అనాథలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలోని ఆయా పార్టీల నాయకులు సంబరపడిపోయారు. కాంట్రాక్టులు ఆశించిన వారు కొందరైతే...నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్న వారు మరికొందరు. అధికారం చేపట్టి వంద రోజులు గడిచినా నామినేటెడ్ పోస్టుల భర్తీ ఊసే లేదు. తీరా నియామకాలు చేపట్టిన చంద్రబాబు జిల్లాకు రిక్తహస్తం చూపారు. డైరెక్టర్ పోస్టుతో సరిపెట్టారు. దీంతో పదవులు ఆశిస్తున్న నేతలు నిరాశచెందారు. చంద్రబాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఆశావహులకు భంగపాటు
- పల్నాడు జిల్లాకు డైరెక్టర్ పోస్టుతో సరి
- కుర్రా అప్పారావుకు టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టు
- బాబు తీరుపై కూటమి నేతల అసంతృప్తి
- టీడీపీ జెండాలు మోసిన జనసేన, బీజేపీ కార్యకర్తలకు ఒక్క పోస్టు ఇవ్వని చంద్రబాబు
- అసంతృప్తిలో జనసేన నేత సయ్యద్ జిలానీ, టీడీపీ నేత నల్లపాటి రాములు
- మక్కెన, జంగా, మల్లెల రాజేష్‌లకు పదవుల ఆశచూపి మోసం
- అన్ని నియోజకవర్గాలలోని ప్రధాన నేతల్లో నిరాశ

కూటమిలో నామినేటెడ్ కుంపటి



సాక్షి, నరసరావుపేట: ఓటమి భయంతో అన్ని పార్టీల నాయకులకు హామీల మీద హామీలు నిచ్చిన చంద్రబాబు.. తీరా అధికారం చేతికొచ్చాక తన తెప్ప దాటు వ్యవహారాన్ని మరోసారి బయటపెట్టారు. అధికార పగ్గాలు అందుకున్న వెంటనే నామినేటెడ్ పోస్టుల రూపంలో అందలమెక్కిస్తానని ఆశల వల వేశారు. ఇది నమ్మిన వివిధ పార్టీల నేతలు వరుస పెట్టి పసుపు కండువా కప్పుకున్నారు. అలాగే ఎమ్మెల్యే సీటు ఆశించిన సొంత పార్టీ వారికి అధికారంలోకి వచ్చాక రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యత గల పోస్టులు ఇస్తానంటూ ఆశచూపాడు. కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీ నేతలకు ఊహల పల్లకీలో ఊరేగించాడు. మీకు రెడ్ కార్పొరేట్‌తో కార్పొరేషన్ పదవులు ఇస్తానని నమ్మబలకాడు. దీంతో వారి స్థాయిలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి శాయశక్తులా కృషి చేశారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక మిత్రపక్ష, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులను పక్కన పెట్టేశారు. కానీ చంకలు గుద్దుకుంటూ బాబు పంచన చేరిన వారు ఇదిగో రాబోయే నామినేటెడ్ పోస్టుల లిస్టులో ఫస్ట్ పేరు తమదేనని కాలర్ ఎగరవేశారు. తీరా నామినేటెడ్ పోస్టుల జాబితా వచ్చాక బూతద్దం పెట్టి చూసినా సదరు నాయకుల పేర్లు కనిపించకపోవడంతో.. బాబు గారు మరోసారి ముంచారంటూ తలలు పట్టుకుంటున్నారు.

డైరెక్టర్ పదవితో సరిపెట్టారు

తాజాగా ప్రకటించిన కార్పొరేషన్ పదవులలో పల్నాడు జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని కూటమి నేతలు రగిలిపోతున్నారు. ఒక్కటంటే ఒక్క చైర్మన్ పోస్టు కేటాయించలేదు. చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన కుర్రా అప్పారావుకు మాత్రమే ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి దక్కింది. ఇతర కూటమి నేతలకు ఎటువంటి పదవి వరించకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. చంద్రబాబు తీరుపై మండిపోతున్నారు.

ఎమ్మెల్యే సీట్లు ఆశించిన వారికి భంగపాటు

నరసరావుపేట టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం టీడీపీ నేత నల్లపాటి రాము తీవ్రంగా ప్రయత్నించారు. ఓ దశలో టికెట్ వచ్చేసిందన్న ప్రచారం కూడా ఆయన వర్గం బలంగా చేసింది. కుల సమీకరణలో భాగంగా చదలవాడ అరవింద్‌బాబు ఇవ్వాల్సి వస్తోందని, అధికారంలోకి వచ్చాక మంచి నామినేటెడ్ పదవి కట్టబెడతామని అధిష్టానం నుంచి నల్లపాటి రాము హామీ లభించినట్లు సమాచారం. అధికారంలోకి రావడంతో తనకు మంచి నామినేటెడ్ పదవి దక్కుతుందని ఆశపడ్డాడు. తీరా చూస్తే తాజా జాబితాలో నల్లపాటి పేరు లేకపోవడంతో ఆయన వర్గం తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని సమాచారం. మరో వైపు నరసరావుపేటకే చెందిన కోడెల శివరాంకి సత్తెనపల్లి టికెట్ ఇవ్వకపోవడంతో అధికారంలోకి వచ్చాక శివరాంకు ప్రాధానత్య ఉంటుందని అనుకున్నారు. అదీ జరగలేదు. సత్తెనపల్లి టీడీపీ టికెట్ కోసం తొలి నుంచి ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, అబ్బూరి శివనాగమల్లేశ్వరరావులకు చంద్రబాబు మొండిచేయి చూపాడు. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినప్పటికి ఆయన వర్గంలో ఏమాత్రం నమ్మకం లేదు.

అప్రధాన పోస్టులు ఇచ్చినా ఫలితం లేదని పెదవివిరుపు

కూటమి నేతల అసంతృప్తులను గుర్తించిన చంద్రబాబు దసరాకు మరిన్ని నామినేటెడ్ పదవులంటూ మరోసారి ఆశ చూపి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరూ ఆందోళన చెంది వ్యతిరేకంగా మాట్లాడవద్దని హితవు పలుకుతున్నారు. అయితే మరోసారి మోసపోవడానికి కూటమి నేతలు సిద్ధంగా లేరు. ఇప్పటికే ప్రధానమైన కార్పొరేషన్ల పందేరం ముగిసిందని, మిగిలిన అప్రధానమైన పోస్టులతో ఒరిగేదేమీ లేదని పెదవివిరుస్తున్నారు. వాటిని తీసుకోకపోవడమే మంచిదని సదరు నేతలు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

జెండాలు మోసిన జనసేన, బీజేపీలకు మొండిచేయి

కూటమి భాగస్వామి పార్టీలైన జనసేన, బీజేపీ పార్టీలకు అధికారం చేపట్టిన రోజు నుంచి జిల్లాలో ఎటువంటి ప్రాధాన్యత దక్కడం లేదు. పేరుకే ప్రభుత్వంలో భాగస్వామ్యం.. పెత్తనం మొత్తం టీడీపీ నేతల చేతుల్లోనే ఉంది. అధికార కార్యక్రమాలకు ఆహ్వానం కూడా అందడం లేదు. తాజాగా ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో ఒక్కటంటే ఒక్కటి జనసేన, బీజేపీలకు కేటాయించలేదు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, పార్లమెంట్ స్థానాలను త్యాగం చేసి టీడీపీ జెండాలు మోసిన జనసేన, బీజేపీలకు మొండిచేయి చూపారు. నరసరావుపేట ఎమ్మెల్యే సీటు మైనార్టీ కోటాలో నాకే దక్కుతుందని ప్రచారం చేసుకున్న జనసేన నేత సయ్యద్ జిలానీకి టికెట్ దక్కనప్పుడు రాష్ట్రస్థాయిలో మంచి నామినేటెడ్ పదవీ ఇస్తామని హామీ దక్కిందని ప్రచారంలో ఉంది. ఆయనకు కార్పేరేషన్ పదవుల లిస్ట్‌లో చోటుదక్కలేదు. సత్తెనపల్లికి చెందిన జనసేన నేత బొర్రా వెంకట అప్పారావు కన్నా లక్ష్మీనారాయణకు రెబల్‌గా నామినేషన్ వేశాడు. ఆయనను బుజ్జగించి, గట్టి హామీతో నామినేషన్ ఉపసంహరించారని సమాచారం. అప్పారావుకు ఎటువంటి పదవీ దక్కలేదు. ఇలానే మిగిలిన నియోజకవర్గాలలో టీడీపీ గెలుపుకోసం కృషి చేసిన జనసేన, బీజేపీ నేతలకు చంద్రబాబు మొండిచేయి చూపారు.

వైఎస్సార్ సీపీ నుంచి వెళ్లిన వారికి విలువ ఏదీ?

ఎన్నికల ముంగిట వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయిన నేతలకు చంద్రబాబు అండ్ కో నుంచి గట్టి హామీలే లభించాయి. అధికారంలోకి రాగానే రాష్ట్రస్థాయిలో మంచి పదవులు కట్టబెడతామని చెప్పారు. అయితే అలా పార్టీ మారిన ఏ నేతకు తాజాగా లిస్ట్‌లో పదవులు దక్కలేదు. వినుకొండ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గురజాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, చిలకలూరిపేటకి చెందిన మల్లెల రాజేష్‌నాయుడు ఈ బాధితుల లిస్ట్‌లో ప్రముఖంగా ఉన్నారు. వీరికి కొత్త ప్రభుత్వంలో ఎటువంటి పదవులు, ప్రాధాన్యత దక్కలేదు.

న్యూస్‌రీల్

టెట్‌కు ఏర్పాట్లు పూర్తి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో ఏపీ టెట్-2024 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. అక్టోబర్ మూడు నుంచి 21వ తేదీ వరకు జరగనున్న టెట్ పరీక్షకు 9,556 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్లుగా నిర్వహించబడతాయని వివరించారు. పరీక్షల నిర్వహణకు నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల అటానమస్ బ్లాక్-4, ఏ.ఎం.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, పెట్లూరివారిపాలెం, ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల కేసానుపల్లి పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్టు వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈఓ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు ఉదయం ఏడు నుంచి రాత్రి 10 గంటల వరకు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. సందేహాల నివృత్తికి కార్యాలయ సిబ్బంది కె.ప్రసాదబాబు 9704494654, వై.తిరుపతిరావు 9177020977, జి.జీవరత్నం 9866904960, పి.శంకరరాజు 9963192487 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

క్రోసూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి కె.సంజీవరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. జాబ్‌మేళాలో సుమారు ఐదు కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. జీతం వారి విద్యార్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లమా, ఫార్మసీ, పీజీ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు 18-35 సంవత్సరాల లోపు హాజరుకావచ్చన్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని 8074393466 సంప్రదించి తెలుసుకోవచ్చునన్నారు. httr//rkiuniverre .aprrdc.in నందు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారు జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

సీన్ మారింది...



పిడుగురాళ్ల: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అడుగుపెట్టగానే కోర్టు వాతావరణం కనిపించేది. కోర్టులో న్యాయమూర్తి చుట్టూ క్యాబిన్, రెడ్ మ్యాట్ ప్రత్యేకత కనిపించేది అలాగే సబ్ రిజిస్ట్రార్‌ని చూడగానే కోర్టులో జడ్జిలా అనిపించేది. రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కూడా అందరి అధికారులాగానే ఉండాలని ఆదేశాలు జారీ చేయటంతో పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా ఎత్తైనా ప్లాట్ ఫారాన్ని తొలగించి ఆ స్థానంలో టేబుల్, కుర్చీ ఏర్పాటు చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 588.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,120, ఎడమకాలువకు 5,087, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,501, ఎస్ఎల్‌బీసీకి 2,400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 46,108 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: ఇర్లపాడు కేంద్రియ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయ పోస్టుల్లో పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఫరూక్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీజీటీ తెలుగు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు కావాల్సి ఉన్నందున ఆదివారం ఉదయం 9 గంటలకు విజయవాడ సత్యనారాయణపురంలోని కేంద్రియ విద్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://ఇర్లపాడు.కెవిఎస్.ఎసి.ఇన్ వెబ్‌సైట్ నందు సంప్రదించాలని కోరారు.

ఎన్‌జీవో కాలనీ పార్కులో ధ్యాన వేదిక తొలగింపు



పార్కులో కూల్చివేసిన వేదిక

- వేదిక స్థానంలో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేసే ప్రయత్నం
- మాకేమి తెలియదు అంటున్న మున్సిపల్ అధికారులు
- పోలింగ్ బూత్‌గా మార్చుకునే ఆలోచనలో టీడీపీ వర్గీయులు
- పార్కుల్లో ఎటువంటి నిర్మాణాలు చేయరాదని చెప్పిన సుప్రీంకోర్టు
- పట్టించుకోని అధికారులు, టీడీపీ నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు పెట్రేగి పోతున్నారు. ప్రభుత్వ అధికారులకు తెలియకుండా తమ సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉద్యానవనంలో ఆరేళ్ల కిందట నిర్మించిన ధ్యాన వేదిక కూల్చివేశారు. ఈ పనులు బుధవారం నుంచే ప్రారంభమైనట్లు తెలిసింది. ఒక ప్రొక్లయిన్‌తో కొంత మంది కూలీలు వేదిక అమర్చిన పాలిష్ బండరాళ్లను తొలగించి పక్కన పెట్టారు. వేదిక నిర్మాణాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన శ్రీను అనే వ్యక్తి ముఖ్యనేత అండదండలతో రెండు గదుల నిర్మాణం చేసేందుకు ఈ పనికి పూనుకున్నాడని చెబుతున్నారు.

వివరాలు..2018కు ముందు ఈ పార్కును ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణ మౌలిక వసతుల కల్పన (అమృత్) పథకం కింద నిర్మించారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త హయాంలో నిర్మించిన ఈ పార్కును 2018 మే రెండో తేదీన అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. పార్కుకు వచ్చిన వ్యక్తులు మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేసుకునేందుకు ఒక ప్లాట్ ఫామ్(వేదిక) నిర్మించారు. సాయంత్రం సమయంలో వందలాది మంది స్థానిక ప్రజలు ఈ పార్కుకు వచ్చి సేద తీరుతుంటారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కూల్చివేసిన వేదిక స్థానంలో ఓ వ్యక్తి తన సొంత డబ్బులతో కమ్యూనిటీ హాలు నిర్మించి తన పేరు పెట్టుకోవాలనే దురుద్దేశ్యంతో ఆఘమేఘాలపై వేదిక తొలగింపునకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం.

భవిష్యత్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు లక్ష్యం

రెడ్డినగర్‌లోని స్కూలులో పోలింగ్ కేంద్రం ఉంది. ఇప్పుడా స్కూలును తొలగించారు. ఆ స్కూలులో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని మరో చోట ఏర్పాటుచేయాల్సిన అవసరం ఏర్పడింది. అదే జరిగితే తమకు ఇబ్బంది వస్తుందని భావించిన తెలుగు తమ్ముళ్లు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారనే వాదన వినిపిస్తోంది. విడిరోజుల్లో కమ్యూనిటీ హాలుగా ఉపయోగించుకొని ఎన్నికల సమయానికి పోలింగ్ బూత్‌గా ఉపయోగించాలనే ఉద్దేశంతో నాయకులు ఈ నిర్ణయం తీసుకొని పార్కులో ఉన్న నిర్మాణాన్ని కూల్చివేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పార్కులో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదు. ఎవరైనా కోర్టుకు వెళితే ముందుగా ఇబ్బందులు ఎదుర్కొనేది మున్సిపల్ అధికారులేనని స్థానికులు అంటున్నారు. ఇటువంటి నిర్మాణాలు పార్కులో చేయాలనే తలంపు కోడెల హయాంలోనే రాగా ఆయన వ్యతిరేకించినట్లు సమాచారం.

సర్వేయర్‌ను పంపాం

తనకు తెలియదు. కొంతమంది వ్యక్తుల ద్వారా సమాచారం రాగానే పట్టణ సర్వేయర్ సాయి కుమార్‌ను అక్కడకు పంపాం. దీనిపై సర్వేయర్‌ను సంప్రదించగా తాను వెళ్లేటప్పటికే పొక్లెయిన్ అక్కడ ఉందని, దానిని పంపించేసి అక్కడున్న వ్యక్తులను పనిచేయొద్దని చెప్పి వచ్చానని అన్నారు. సర్వేయర్ వచ్చి వెళ్లిన తర్వాత యథేచ్ఛగా పని ముగించటం గమనార్హం.

– ఎం.జస్వంతరావు, కమిషనర్

టెట్ టెన్షన్

ఉదయ్‌కుమార్‌ది సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి స్వగ్రామం. ఇతను టెట్ పరీక్షకు దరఖాస్తు చేయగా 160 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నంలో సెంటర్ కేటాయించారు. మచిలీపట్నం రానుపోను చార్జీలు సుమారుగా రూ.460 అవుతుంది. ముందు రోజే అక్కడకు చేరుకుంటే అదనంగా లాడ్జి, భోజనం ఇతర ఖర్చులు భరించాల్సి ఉంటుంది.

టి.నరేంద్రది సత్తెనపల్లి మండలం భట్లూరు స్వగ్రామం. ఇతను టెట్ పరీక్షకు దరఖాస్తు చేయగా తిరువూరులో పరీక్ష కేంద్రం కేటాయించారు. భట్లూరు నుంచి తిరువూరుకు రానుపోను సుమారుగా రూ.420 ఖర్చు అవుతోంది. ముందు రోజే అక్కడకు చేరుకుంటే అదనంగా లాడ్జి, భోజనం ఇతర ఖర్చులు భరించాల్సి ఉంటుంది.

ఇలా టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒక్కొక్కరిపైన రూ.వెయ్యి భారం పడుతుంది. అభ్యర్థులకు ప్రయాణ భారంతోపాటు ఖర్చు తప్పడం లేదు. జిల్లాలో అనేక మంది అభ్యర్థుల పరిస్థితి ఇలానే ఉంది. అందరిలోనూ టెన్షన్ నెలకొంది.

- సుదూర ప్రాంతాల్లో టెట్ పరీక్ష కేంద్రాలు
- అభ్యర్థులపై ఆర్థిక భారం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

సత్తెనపల్లి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసే అభ్యర్థులకు పరీక్ష రాయక ముందే అసలు పరీక్ష చూపించడంతో అవస్థలు తప్పడం లేదు. టెట్ పరీక్ష రాసేందుకు వారు ఎంపిక చేసుకున్న ఆప్షన్లకు కాకుండా ఇతర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడంతో వెళ్లడానికి ప్రయాణం పెద్ద సమస్యగా మారబోతోంది. టెట్ ఉత్తీర్ణులైన వారు మాత్రమే డీఎస్సీ పరీక్ష రాయడానికి అర్హత పొందుతారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలు రాసేందుకు అక్టోబర్ 3 నుంచి 21 వరకు ముందస్తుగా టెట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు విద్యాశాఖ చేపట్టింది. జిల్లాలో 1,057 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నట్లు గుర్తించారు. వీటిని జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన అర్హత పరీక్ష టెట్ నిర్వహణ చేపట్టబోతున్నారు. అభ్యర్థులు పరీక్ష రాయడానికి ఓ వైపు సిద్ధమవుతుండగా .. మరోవైపు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలు పట్టణాలకు దూరంగా ఉన్నాయి. కొంత మంది అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాలు 150 నుంచి 180 కిలోమీటర్ల పైగా ఉండడంతో వారికి ఇక్కట్లు తప్పక వాపోతున్నారు.

జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా నరసరావుపేటలో నాలుగు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఈ కేంద్రాలలో 9,556 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

రెండు పరీక్షలు

టెట్ రాసే అభ్యర్థులు మూడు జిల్లాలకు ఆప్షన్లు ఇచ్చారు. కొందరు రెండు పరీక్షలు రాయాల్సి ఉంది. ఉదయం, మధ్యాహ్నం సమయంలో వేర్వేరు చోట్ల పరీక్షలు రాయాల్సి ఉంది. ఇలాంటి వారు పరీక్షకు వెళ్లి రావడం చాలా కష్టం. పట్టణాలకు సుదూర ప్రాంతాల్లో ఉండే కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా పరీక్ష కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో ఒక్క రోజు ముందే వెళ్లి వెతుక్కుంటూ ఆయా ప్రాంతాల్లో ఉండి పరీక్ష రాయడానికి అధిక ఖర్చుల భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అందుబాటులో ఉండే విధంగా పరీక్ష కేంద్రాలు మార్పు చేసేలా చూడాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.



భట్లూరు అభ్యర్థికి తిరువూరు కేటాయించిన హాల్ టికెట్

సుదూర ప్రాంతానికి వెళ్లాలి



నాది సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామం. ఇక్కడి నుంచి నాలుగు బస్సులు మారి పరీక్షకు రాసేందుకు హాజరు కావాలి. సుదూర ప్రాంతంలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించడంతో అదనపు ఖర్చు కానుంది.

– టీ.నరేంద్ర, అభ్యర్థి, భట్లూరు

160 కిలోమీటర్లు ప్రయాణించాలి



నాది సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామం. నాకు మచిలీపట్నంలో పరీక్ష కేంద్రం కేటాయించారు. ఇక్కడ నుంచి 160 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. ఒక్క రోజు ముందే హాజరు కావాలంటే ఖర్చుల భారం పెరగనుంది.

– తాళ్లూరి ఉదయ్‌కుమార్, అభ్యర్థి, కంకణాలపల్లి

శావల్యాపురం ఆరోగ్య కేంద్రానికి అరుదైన గౌరవం

శావల్యాపురం: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అరుదైన గౌరవం దక్కింది. ప్రజలకు ఉత్తమ సేవలందించడంలో ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) అగ్రభాగాన నిలిచి ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. నేషనల్ హెల్త్ సిస్టం రీసెర్చ్ సెంటరు మినిస్ట్రీస్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నమెంటు ఆఫ్ ఇండియా నేషనల్ క్వాలిటీ ఆఫ్ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్‌ల ఆధ్వర్యంలో శావల్యాపురం ఆరోగ్య కేంద్రంలో సెప్టెంబరు 11 తేదీలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఆరోగ్య కేంద్రం 92.88 శాతం స్కోర్ సాధించి జాతీయ స్థాయిలో నిలిచింది. పల్నాడు జిల్లాలో అరుదైనా అవకాశాన్ని శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దక్కించుకుంది. ప్రధానంగా ఎమర్జన్సీ, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, ల్యాబ్ ఫార్మసీ, క్లీన్ అండ్ గ్రీన్, ఆపరేషన్ థియేటర్, సేవలు, యాక్సిడెంట్ కేసుల సేవలలో మంచి సేవలను ప్రజలకు అందించింది. గతంలో కూడా ఈఆరోగ్య కేంద్రానికి సర్వేలో మంచి ఫలితాలు రావటంతో మరలా రెండవసారి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు రావడంతో వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది వైద్య సేవలు గుర్తించి ఇలాంటి గుర్తింపులు రావటంతో అందరు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయనుంది.



శావల్యాపురం ఆరోగ్య కేంద్రం



PHC Savalyapuram Certified...

National Health Systems Resource Centre

ధ్రువీకరణ పత్రం

క్లుప్తంగా

నార్త్‌జోన్, సౌత్‌జోన్ మ్యాచ్ ప్రారంభం



నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్ నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలో భాగంగా నార్త్‌జోన్, సౌత్ జోన్ మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. వర్షం కారణంగా బుధవారం తొలిరోజు ఆట రద్దు కాగా, గురువారం టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు నష్టానికి 259 పరుగులు చేసింది. జట్టులోని జి.సాయిపూర్ణతేజ 143 బంతుల్లో 100 పరుగులు చేయగా, బి.సుహాస్ 53 పరుగులు సాధించాడు. సౌత్‌జోన్ బౌలర్లు భార్గవానంద్ 4, రెడ్డి ప్రకాష్ మూడు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ రెండవరోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 66 పరుగులు చేసింది. యోగానంద్ 31, వై.తేజరెడ్డి 27 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయానికి ఎంతో డిమాండ్



వేటపాలెం: ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయానికి ఎంతో డిమాండ్ ఉందని వ్యవసాయశాఖ డీపీఎం విజయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని పందిళ్లపల్లిలో సేంద్రియ వ్యవసాయం ద్వారా 50 ఎకరాల్లో సాగు చేసిన వరిని ఇంటర్నేషనల్ మార్కెటింగ్ ఆర్గనైజర్ డాక్టర్ శరవణ్ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా డీపీఎం వారికి సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేసిన వరి, ఇతర పంటల వివరాలను తెలియజేశారు. డ్రోన్ సహాయంతో ద్రవ జీవామృతాన్ని పంటపై పిచికారీ చేస్తున్న తీరును అంతర్జాతీయ బృందానికి చూపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. రైతులు కూడా నాణ్యమైన ఉత్పత్తులతో పాటు అధిక దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.కాశీవిశ్వనాథ్, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్తు అదాలత్‌తో సమస్యలకు పరిష్కారం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ సూచించారు. గుంటూరు పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం అదాలత్ నిర్వహించారు. వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. 15 దరఖాస్తుల్లో తక్షణం 10 పరిష్కరించేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడారు.

వెంకటాయపాలేనికి పర్యాటక శోభ

- అటవీ ప్రాంతంలో సుందరమైన ఆలయం
- రెండు కొండల మధ్య వెలసిన శింగరశ్వరుడు
- పరవళ్లు తొక్కే జలపాతంతోపాటు నిత్యం పారే జలధార
- అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



కొండల మీద నుంచి పరవళ్లు తొక్కుతున్న జలపాతం



రెండు కొండల మధ్య ఉన్న శింగరేశ్వరుని ఆలయం

బెల్లంకొండ: సెలవులు వస్తే చాలు పిల్లలను ఏదో ఒక ఊరు తీసుకువెళ్దాం.. అక్కడ విశేషాలు వారి చూపిస్తూ వారితో సరదాగా ఎంజాయ్ చేద్దాం అంటూ చాలా మంది తల్లిదండ్రులు అనుకుంటారు. ఎక్కడో ఉన్న అరకు వెళ్దామా.. లేదా విశాఖపట్నం వెళ్దామా అంటూ దూరప్రాంతాలకు వెళ్తారు. కానీ మన చుట్టు ప్రక్కల ఉండే ఎంతో సుందరంగా ఉండే పర్యాటక ప్రదేశాల గురించి తెలియక చూడలేకపోతుంటారు. పల్నాడు జిల్లాలో ఎంతో ప్రసిద్ధి పొందిన పర్యాటక ప్రదేశాలు, ప్రముఖమైన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, అనుపు జలపాతం, కొండవీడు కోట, పులిచింతల ప్రాజెక్టు ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ వెలుగులోకి వచ్చిన పర్యాటక ప్రదేశాలు. కానీ జిల్లాలో వెలుగులోకి రాకుండా ఉన్న ప్రదేశాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. వాటిలో ఇప్పుడిప్పుడే పర్యాటక ప్రదేశంగా వెలుగులోకి వస్తున్న బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామంలో కొండ శింగరేశ్వర ఆలయం, జలపాతం. ఎంతో విశిష్టత కలిగిన నరసింహస్వామి అవతారమైన శింగరేశ్వరస్వామి ఆలయంతో పాటుగా కొండల్లో నుంచి నిత్యం పారే జలధార ప్రత్యేకం. అంతేకాకుండా వర్షాకాలంలో ఎత్తైన కొండల నుంచి పరవళ్లు తొక్కే జలపాతం మరో ప్రత్యేకత. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక ప్రాంతమైన కొండ శింగరేశ్వర ఆలయం, జలపాతంపై ప్రత్యేక కథనం..

ఎత్తైన కొండల నడుమ...

బెల్లంకొండ మండలంలోని చారిత్రాత్మక ప్రదేశాలు చాలా ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూర్ వజ్రం లభించిన ప్రదేశంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన ఆలయం కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి ఉన్న గ్రామం కోళ్లూరు గ్రామం. ప్రస్తుతం ఈ గ్రామం పులిచింతల ప్రాజెక్టు ముంపులో ఉంది. దీంతో ఆలయాన్ని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేశారు. కేతవరంలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంతోపాటుగా చక్రవర్తులు, రాజులు నివాసమున్న అప్పటి బిల్లంకొండ అదే నేటి బెల్లంకొండ. వీటితోపాటుగా సుందర ఆధ్యాత్మిక ప్రదేశమైన వెంకటాయపాలెం గ్రామంలో అటవీ ప్రాంతంలో ఎత్తైన కొండల మధ్య ఉన్న శ్రీ కొండ శింగరేశ్వర స్వామి ఆలయం. పచ్చని పొలాలు మధ్య ఎత్తైన కొండలలో ఈ ఆలయం వుంది. క్రీ.శ.18వ శతాబ్దంలో శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు నదీ తీర ప్రాంతాలను పరిపాలించే సమయంలో ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటూ వెంకటాయపాలెం గ్రామాన్ని ఏర్పాటుచేశారు. అంతకు ముందే రెండు కొండల నడుమ గుహలో శింగరేశ్వరస్వామి విగ్రహం వుంది. శింగరేశ్వరుని మహిమల గురించి తెలిసిన వెంకటాద్రినాయుడు దేవాలయానికి ఖ్యాతిని తెచ్చే ప్రయత్నం చేశారు. పెద్ద గుహ లాంటి ప్రదేశంలో రెండు ఎత్తైన కొండల మధ్య ఒక కొండ ఆగి ఉంటుంది. కొండ క్రింద నుంచి గుహలోని విగ్రహం వరకూ మెట్ల మార్గం అమర్చబడి వుంది. మెట్ల మార్గంలో మధ్యలో లక్ష్మీదేవి విగ్రహం, ఆంజనేయ స్వామి విగ్రహం, దుర్గా మాతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. కొండ పైన గుహలో వెలసిన శింగరేశ్వరస్వామిని పర్యాటకులు దర్శించవచ్చు. ఇక్కడ ఎంతో ప్రశాతంగా ఉండే ఆశ్రమం కూడా కలదు.

నిత్య జలధార

స్వామి వారి తలభాగంలో ఉన్న కొండల్లో ఎంతో దూరం నుంచి శింగరేశ్వరుని పాదాల ద్వారా మెట్ల క్రింద నుంచి కొండ క్రిందకు ఒక జలధార ప్రవహిస్తూ ఉంటుంది. ఈ ధార నుంచి ఏడాది పొడవునా, ఎండాకాలంలోనూ ప్రవహిస్తూ వుంటాయి. అటవీ ప్రాంతంలో ఉన్న ఎన్నో చెట్ల వేర్లను తాకుతూ వచ్చే ఈ నీళ్లు ఎంతో తియ్యగా ఉంటాయి. ఈ జలాన్ని సర్వ రోగ నివారిణిగా ఇక్కడికి వచ్చే పర్యాటకులు చెబుతుంటారు. అదే విధంగా కొండపైన సుందర రూప అటవీ ప్రాంతాన్ని చూడవచ్చు. చుట్టూ పచ్చని మైదానాలతోపాటు వర్షాకాలంలో నీటి ప్రవాహాన్ని వీక్షించవచ్చు.

ఈ ప్రాంతాన్ని చేరుకోవాలంటే...

- గుంటూరు నుంచి బెల్లంకొండ క్రాస్ రోడ్డుకు రావాలి. చార్జి రూ.65
- అక్కడి నుంచి బెల్లంకొండ ఆటో లేదా బస్సులో రావచ్చు. ఛార్జీ రూ.10
- అక్కడి నుంచి ఆటోలో కానీ బస్సులో కానీ వెంకటాయపాలెం వచ్చి శింగరేశ్వరుని ఆలయానికి చేరుకోవచ్చు.
- సత్తెనపల్లి నుంచి ప్రతి రోజూ ఉదయం 5.30 గంటలకు నేరుగా వెంకటాయపాలెంకు బస్సు సౌకర్యం ఉంది.

పరవళ్లు తొక్కే జలపాతం

ఈ ఆలయం వద్ద వర్షాకాలం వస్తే సుందరమైన జలపాతం దర్శనమిస్తుంది. అటవీ ప్రాంతంలో ఉండే వర్షపు నీరంతా ఆలయానికి ఎదురుగా ఉండే ఎత్తైన కొండల మీదగా ప్రవహిస్తుండంతో కొండల మీద నుంచి కిందకు జాలువారుతూ తెల్లని పాల నురగల వలే అద్భుత దృశ్యాన్ని ఆవిష్కృతం చేస్తాయి. వర్షం పడితే చాలు గ్రామంలోని చిన్నారులు, యువత, చుట్టుప్రక్కల గ్రామాల వారు జలపాతాన్ని చూసేందుకు తరలివస్తారు. తొలకరి వర్షాలు కురిసే సమయం నుంచి అక్టోబర్ నెల వరకూ ఈ జలపాతాన్ని చూడవచ్చు.

లడ్డూ ప్రసాదంపై పాలకుల కుటిల నీతి

- భక్తులకు వాస్తవాలు తెలియచేయాలి
- సూపర్ సిక్స్ అమలు చేయండి
- పీడీఎం నాయకుల డిమాండ్

నరసరావుపేట: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వస్వామి లడ్డు ప్రసాదంను వివాదం చేసి రాజకీయ లబ్ధి పొందాలని పాలకుల కుటిల నీతిని ప్రజలు అర్థం చేసుకోవాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) కోరింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, వెంకటేష్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. లడ్డూలో కల్తీ జరిగిందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో లడ్డూలో ఉపయోగించే మెటీరియల్, నెయ్యి వగైరా ఏ కంపెనీలు ఎవరు సరఫరా చేస్తున్నారనే దానిపై ప్రభుత్వం విచారణ జరిపి భక్తులకు తెలియచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా రైతు పెట్టుబడి సహాయం నేటికీ అందలేదన్నారు. తల్లి దీవెన, ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి, సూపర్ డీఎస్సీ ఎక్కడని ప్రశ్నించారు. వీటితో పాటు అనేక హామీలు ఇచ్చి వాటి గురించి ప్రస్తావనే లేకుండా ఇతర అంశాలను తెరపైకి తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే కల్తీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మైనింగ్ ఏడీగా ప్రకాష్‌కుమార్



దాచేపల్లి: భూగర్భ గనుల శాఖ దాచేపల్లి సహాయ సంచాలకులుగా పులివర్తి ప్రకాష్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీగా విధులు నిర్వర్తించిన అశోక్‌కుమార్ అమలాపురం బదిలీ కాగా చిత్తూరులో విధులు నిర్వర్తిస్తున్న ప్రకాష్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యాలయం సిబ్బంది ఏడీ ప్రకాష్‌కుమార్‌కి స్వాగతం పలికారు. అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టి సిబ్బందితో మాట్లాడారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి జట్ల ఎంపికలు



ఎంపికైన అండర్-19 బాల,బాలికల సెపక్‌తక్రా జట్టు



ఎంపికైన అండర్-14,అండర్-17 బాల,బాలికల సెపక్‌తక్రా జట్టు



ఎంపికైన అండర్ -19 బాల,బాలికల రగ్బీ జట్టు

- సత్తెనపల్లి

గంజాయి విక్రేత అరెస్టు

రేపల్లె రూరల్: పరారీలో ఉన్న గంజాయి విక్రేతను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు పట్టణ సీఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా మేరుగ

పార్లమెంట్ పరిశీలకుడిగా మాజీ ఎంపీ నందిగం సురేష్



మేరుగ నాగార్జునను అభినందిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మేరుగ నాగార్జున దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి అనుచరుడిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 2019లో వేమూరు నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా గెలుపొందారు. ఆయన మంత్రి వర్గంలో సాంఘిక సంక్షేమశాఖామంత్రిగా పనిచేశారు. పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా తనకు అవకాశమిచ్చిన అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జునను జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. నాగార్జునను ఎమ్మెల్సీ, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి ఎల్. అప్పిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

- పార్టీ పార్లమెంట్ పరిశీలకుడిగా బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులిచ్చింది. నందిగం సురేష్‌ను పరిశీలకుడిగా నియమించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

ఆ పరిహారంతో మాకు న్యాయం జరగదు

- రైతులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే
- సేకరించనున్న 153 రైతులకు చెందిన 50 ఎకరాల పంట భూమి
- చల్లగుండ్ల, దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల రైతులు హాజరు
- ప్రభుత్వ లెక్కల ప్రకారం భూముల విలువ ఎకరా రూ.4.75లక్షలు
- పరిహారమిచ్చేది రోడ్డుకు దూరం గల భూములకు రూ.12.50లక్షలు
- దగ్గరగా ఉన్న భూములు ఎకరాకు రూ.32లక్షలు
- పరిహారంతో న్యాయం జరగదని మండిపడుతున్న రైతులు



పత్రాలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే

నకరికల్లు: మావి రెండు పంటల పండుతూ హైవేకు ఆనుకొని ఉన్న పంట భూములు.. మీరిచ్చే పరిహారం మాకు సరిపోదు అంటూ కలెక్టర్ ఎదుట భూములు కోల్పోతున్న రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నకరికల్లు అడ్డరోడ్డు నుంచి చీరాల ఓడరేవు వరకు నాలుగులైన్ల రహదారి ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సమావేశం నిర్వహించారు. సమావేశానికి చల్లగుండ్ల, రూపెనగుంట్ల, దేచవరం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నకరికల్లు అడ్డరోడ్డు నుంచి ప్రారంభమవుతున్న నాలుగులైన్ల రహదారిలో రోడ్డుకు ఇరువైపులా గుర్తించిన భూమిలో 153 మంది రైతులకు చెందిన 50 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేకరించాల్సి ఉన్న భూమి ధర ఎకరా రూ.4.75 లక్షలు ఉందన్నారు. ఈ లెక్క ప్రకారం రోడ్డుకు దూరంగా పొలాలకు ఎకరా రూ.12.50లక్షలు, రోడ్డుకు సమీపంలో ఉన్న భూములకు ఎకరాకు రూ.32లక్షల వరకు నష్టపరిహారం రూపంలో చెల్లిస్తామన్నారు. ఇళ్ల స్థలాలు నష్టపోతున్నట్లయితే సెంటుకు రూ.1.25లక్షలు, బోర్లు, ఇళ్ల తొలగించాల్సి వస్తే ఆర్అండ్‌బీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తారని అన్నారు.

ఈ పరిహారం సరిపోదు

ప్రస్తుతం ఇస్తామన్న పరిహారం మాకు ఎలాంటి న్యాయం చేకూర్చదని చల్లగుండ్ల, రూపెనగుంట్ల, దేచవరం గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రెండు పంటలు పండుతూ హైవేకు ఆనుకొని ఉన్న పంట భూములకు ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం చూస్తే తీవ్రనష్టం వాటిల్లుతుందని అన్నారు. రోడ్డు నిర్మాణం చేసే క్రమంలో రోడ్డు పొలం మధ్యగా వేస్తే ఒక్క పక్క కొద్దిమేర భూమి, మరొకవైపు కొద్దిమేర భూమి మిగులుతుందని దాంతో ఆ భూమితో ఎలాంటి ప్రయోజనం ఉండదని పలువురు రైతులు వాపోయారు. మిగులు భూమికి కూడా పరిహారం ఇవ్వాలని, మిల్క్‌డెయిరీకి సమీపంలో వస్తున్న రింగ్ రోడ్డు వలన పూర్తి భూమిని కోల్పోతున్న రైతులు న్యాయం చేయాలని పలు డిమాండ్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆయన రైతులతో మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు నేషనల్ హైవేస్ అథారిటీ వారి దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ కె.పుల్లారావు, కలెక్టర్ కార్యాలయం సూపరింటిండెంట్ శివనాగిరెడ్డి, నేషనల్ హైవేస్ ఏఈ ప్రకాష్, ఆయాగ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రాణం నిలబెట్టారు



ఇటీవల వర్షాలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నేలవాలిన చెట్టు



చెట్టును తొలగిస్తున్న జేసీబీ



ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే మరో ప్రాంతంలో తిరిగి నాటిన చెట్టు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అధ్యాపకులు కాలేజీలోని విద్యార్థులకు బోధిస్తుంటారు. బోధనే కాదు....ఇది అక్షర సత్యం చేయాలన్న లక్ష్యంతో పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇటీవల గాలి వానకు నేలవాలిన పెద్ద వృక్షాన్ని తిరిగి నిలబెట్టాలని కళాశాల అధ్యాపకులు నిర్ణయించారు. కిందకు వాలిన చెట్టు వేర్లు దెబ్బతినకుండా జేసీబీ, పొక్లెయినర్‌తో తొలగించారు. పై కొమ్మలు తొలగించి కళాశాల ప్రాంగణంలోనే వేరే చోట చెట్టును తిరిగి నాటారు. అధ్యాపకులను పట్టణ ప్రముఖులు, విద్యార్థులు అభినందించారు.

- పిడుగురాళ్ల